

# నిద్రకు మెళ్ళై

పి. చంద్రశేఖర అజాద్

**ఏలూరు!**
**తెల్లవారుతోంది.**
**చీకట్లని చీల్చుకుంటూ మోపెడ్ పరుగులు తీస్తోంది.**
**తంగెళ్ళమూడి వంతెన దాటి 'విజయరాయి' వెపు సాయిబాబు ప్రయాణం చేస్తున్నాడు.**
**వెనకాల రెండు పెద్దక్యాన్లు తగిలించి వున్నాయి. ముందు రెండు చిన్న పాల క్యాన్లు వున్నాయి.**

ఏటి మీద నుండి చల్లటిగాలి వీస్తోంది. ఒకప్పుడు ఏటి నిండా ఇసుక వుండేది. ఎవరికి కావల్సింది వారు తోలుకుపోయారు. నల్లటి మట్టి దిబ్బలు తేలాయి. అప్పట్లో నీళ్ళు కూడా పరుగులు తీసేవి. గులకరాళ్ళను పలకరిస్తూ. అప్పుడు చిత్రమైన సంగీతం వినిపించేది. ఆ సంగీతం కోసం కొంతమంది ఉదయాలూ, సాయంకాలాలూ దూరం నుండి నడిచి వచ్చేవారు.

నాలుగయిదు సంవత్సరాలుగా అక్కడ సరిగ్గా వానలు కురవటం లేదు. ఎపుడన్నా కురిసినా కొద్దిపాటి నీళ్ళు కనిపించటం తప్ప పొంగి పొర్లటం లేదు. ఇవేవీ సాయిబాబుకి పట్టవు.

అతనిది నియమబద్ధమైన జీవితం. అయిదు గంటలకి నిద్రలేస్తాడు. మోపెడ్‌కి క్యాన్లు కట్టుకుంటాడు. ఆరు సంవత్సరాల క్రితం టీ.వీ.ఎస్ మోపెడ్ కొన్నప్పుడు దాని రూపం వేరేగా వుండేది. ఇప్పుడు అది జేమ్స్‌బాండ్ కారులా వుంటుంది. హెర్క్యులెస్ భుజం మీద మోస్తున్న భూమిలా వుంటుంది. 'విజయరాయి' చుట్టుపక్కల 'పాలు' సేకరించటం అతని కార్యక్రమం. అతనికి తెలిసింది ఆ ఒకటే. అప్పట్లో నాలుగయిదు క్యాన్ల పాలు సేకరించేవాడు ఇప్పుడు మాత్రం రెండు క్యాన్లు నిండటం గగనంగా వుంది.

నెల మొదటివారంలో అందరికీ డబ్బులు యిస్తాడు. మధ్యలో ఎవరికన్నా అవసరం వస్తే అడ్వాన్స్ యిచ్చి తన దగ్గరున్న చిన్న ప్యాకెట్ బుక్‌లో గుర్తుగా రాసుకుంటాడు. అతని ఇల్లు రామచంద్రరావుపేటలో వుంది. మొదట్లో హోటల్స్‌కి పాలు పోసేవాడు. ఇప్పుడు ఇంటి దగ్గరే పాలు అమ్ముతుంటాడు. ఫ్రిజ్ కొన్నాడు. వెన్న తీసే మెషిన్ వుంది. నెయ్యి అమ్ముతుంటాడు. ఈ పనులన్నింటిలో సాయిబాబు భార్య సహాయంగా వుంటుంది. ఎదురుగా ఓ లారీ వస్తుంటే సాయిబాబు ఉలిక్కిపడ్డాడు.

అతనికి ఇంకా నిద్ర మత్తు వదల్లేదు.

'మోపెడ్' ఎర్రమట్టి రోడ్డులోకి తిరిగింది. దుమ్ము లేస్తోంది. అక్కడున్న కొబ్బరి తోటలు.

కొంతమంది టేకు చెట్లను పెంచుతున్నారు. అక్కడక్కడా విసిరేసినట్లు ఇళ్ళు వుంటాయి.

మోపెడ్ వెళ్ళి ఓ ఇంటి ముందు ఆగింది.

ఓ క్యాన్‌ని దించాడు. ప్రసాద్ అప్పుడే సిగరెట్ తాగుతూ వచ్చాడు. నులక మంచం వేసుంది. సాయిబాబు వెళ్ళి దానిమీద కూర్చుని జేబులో నుండి పుస్తకం-డబ్బులు బయటకు తీశాడు. 'కాఫీ తాగుతావా?' అన్నాడు ప్రసాద్.

'వద్దు' అన్నాడు.

'కాఫీకి డబ్బులు తీసుకోం లేవయ్యా కంగారు పడకో' అన్నాడు ప్రసాద్. 'ఇంటి దగ్గర చద్దన్నం తిని వస్తాను. నేను కాఫీ తాగటం ఎప్పుడన్నా నువ్వు చూశావా' అన్నాడు సాయిబాబు. 'అలవాటు చేసుకో. మేం కూడా ఒకప్పుడు కాఫీ తాగినవాళ్ళం కాదు. అయినా పాల బేరం చేసేవాడివి కాఫీలూ, టీలూ తాగకపోతే ఎలా?'

'నాకు అవంటే పడవు' అని చిల్లరతో సహా ప్రసాద్‌కి యివ్వవలసిన డబ్బులు ఇచ్చాడు. ప్రసాద్ లోపలికి వెళ్ళి పాల చెంబు తీసుకు వచ్చాడు. సాయిబాబుకి చూపించాడు.

'రోజూ చూపించనవసరం లేదు. నీ మీద నాకు నమ్మకం వుంది' అన్నాడు సాయిబాబు. ప్రసాద్‌కి మూడు గేదెలున్నాయి. తనే స్వయంగా పాలు పిండుతాడు. అతను పిండి సాయిబాబు దగ్గరకి వచ్చేటప్పటికి నులక మంచానికి అడ్డంగా పడుకుని గురక పెడుతున్నాడు.

'నిద్ర మొకమోడు' అనుకుంటూ లేపి పాలు పోసాడు.

'బయలు దేరతా' అన్నాడు సాయిబాబు.

'రాత్రి ఎన్నింటికి పడుకున్నావేంటి?' అన్నాడు.

'ఎనిమిది గంటలకే'

'ఇప్పుడు మళ్ళీ నిద్రా. నీకు నిద్ర తప్పితే యింకో ప్రపంచం లేదా?' అన్నాడు ప్రసాద్.

చిన్నగా నవ్వి 'నీ దగ్గరే నేను కాసేపు నడుం వాల్చేది. మిగతావాళ్ళు అలా కాదు. ఏమరుపాటుగా వుంటే నీళ్ళు కలిపేస్తారు' అన్నాడు

'ఈనెల నుండి లీటరుకి రూపాయి పెంచు'

'లేదు లేదు నేను కష్టపడటం తప్ప పైసలు మిగలటం లేదు'

'మా బాధలు ఎవరికి చెప్పుకోమంటావు. అయినా పాల వ్యాపారం కంటే నీళ్ళ వ్యాపారం చేసుకుంటే బాగుండేలా వుంది. నేను గేదెల్ని అమ్మేయాలనుకుంటున్నా' అన్నాడు ప్రసాద్.

'ఆపని చెయ్యబాకు. రూపాయి తక్కువ వచ్చినా వున్న దాన్ని వదిలి యింకో వ్యాపారానికి వెళ్ళకూడదు. ఏలూరు ఎప్పుడు వస్తున్నావు?' అన్నాడు సాయిబాబు.

'ఎప్పుడు వచ్చినా ఉపయోగం ఏంటి? నాతో రెండు గంటలు వుంటావా? నీ పనుల్లో నువ్వుంటావు' అన్నాడు.

'మా ఇల్లు కట్టటం అయిపోవచ్చింది. చూద్దువు గాని' అన్నాడు. 'అందులో రెండు గోడలు నావే. మా పాల డబ్బుల తోనేగా వాటిని కట్టింది'

'రెండు గోడలేంటి ప్రసాదూ మొత్తం ఇల్లంతా మీదే. నాకు పాల వ్యాపారం తప్ప యింకోటి చేత కాదు' అన్నాడు

'ఏలూరు రావాల్సిన పనుంది. వస్తాను' అన్నాడు ప్రసాద్.

సాయిబాబు మోపెడ్ కదిలింది. ఎనిమిది గంటలకల్లా ఏలూరు వచ్చాడు క్యాన్‌లు దించాడు. ఆ తర్వాత ఒక గంట సేపు మిషన్ ముందు కూర్చున్నాడు. పదకొండు గంటలు అవుతుండగా ఆ పని భార్యకు అప్పచెప్పి గదిలోకి వెళ్ళి పడుకున్నాడు.

****

ప్రసాద్ స్నేహితుడు రాజారామ్. అతనికి ఏలూరు బదిలీ అయింది. ముందు వచ్చి జాయినింగ్ రిపోర్ట్ యిచ్చాడు. రెండు రోజులు లాడ్జిలో ఓ గది తీసుకుని వున్నాడు. ప్రసాద్‌కి ముందే కబురు చేసాడు. వాళ్ళు సాయంకాలం కలుసుకున్నారు.

'వ్యవసాయం ఎలా వుంది?' అన్నాడు రాజారామ్.

'ఏదో వుంది మనం పెద్దగా ఆశ పడకపోతే యిక్కడ బతకటం బాగానే వుంటుంది. మంచి గాలి, పెరట్లో పండించుకునే కూరగాయలు, టీ.వీ వుంది. ఎప్పుడన్నా సినిమా చూడాలనిపిస్తే ఏలూరు వస్తాను. అయినా గేదెలూ, కొబ్బరి చెట్లూ వున్నాయి. పనిలో పడితే టైమ్ తెలియదు. ఒకటే సమస్య. కరెంటు ఎప్పుడు వస్తుందో , ఎప్పుడు పోతుందో తెలియదు' అన్నాడు

ప్రసాద్‌కి ముందు నుండి ఉద్యోగం చేయటం ఇష్టం లేదు. అతన్ది తెనాలి దగ్గర ఓ గ్రామం. ఇంటర్ దాకా చదివాడు. కాంట్రాక్టులు చేసాడు కొన్ని రోజులు. నష్టం వచ్చింది. అప్పట్లో 'విజయరాయి' దగ్గర భూములు చౌకగా వుండటంతో రెండు ఎకరాలు కొన్నాడు. భార్యాభర్తలు కష్టపడతారు. సాఫీగా సాగుతోంది జీవితం.

'ఏలూరు గురించి నేను విన్నాను. ముఖ్యంగా యిక్కడ ఏరంటే నాకు చాలా యిష్టం. అందుకే ఏలూరు ట్రాన్స్‌ఫర్ చేయగానే నాకు చాలా సంతోషం కలిగింది. నాకు నువ్వు మంచి ఇల్లు చూసి పెట్టు. ఏటికి దగ్గరగా వుంటే యింకా మంచిది' అన్నాడు రాజారామ్.

అప్పుడు ప్రసాద్‌కి సాయిబాబు ఇల్లు గుర్తొచ్చింది. అప్పటికప్పుడు బయలు దేరారు.

సాయిబాబు ఇంటి దగ్గర వాళ్ళ ఆవిడ పాలూ, నెయ్యీ అమ్ముతోంది. ప్రసాద్‌ని అంతకు ముందు చూసింది. అందుకే చిరునవ్వుతో లేచి నిలబడింది.

'సాయిబాబు బయటకు వెళ్ళాడా?' అన్నాడు ప్రసాద్.

'లేదు. నిద్రపోతున్నారు. కూర్చోండి లేపుతాను' అని కుర్చీలు వేసి లోపలకు వెళ్ళింది.

అప్పుడు ఆరు గంటలవుతోంది.

'ఇప్పుడు నిద్రపోవటం ఏంటి?' అన్నాడు రాజారామ్.

'సాయిబాబు గురించి తర్వాత చెబుతా' అన్నాడు ప్రసాద్

అయిదు నిముషాల తర్వాత కళ్ళు నులుము కుంటూ వచ్చాడు.

'నీ యిల్లు చూద్దామని వచ్చాం. నా ఫ్రెండ్ రాజారామ్. తనకి ఏలూరు ట్రాన్స్‌ఫరైంది. నీ ఇల్లు అద్దెకిచ్చినా సరే. ఇంకెక్కడన్నా చూపించినా సరే' అన్నాడు ప్రసాద్.

'మన ఇల్లు నచ్చితే తీసుకోవచ్చు. చూద్దామా' అన్నాడు.

ముగ్గురూ బయలు దేరారు. అంతకు ముందే గృహ ప్రవేశం చేసాను అని చెప్పాడు. రంగులు మాత్రం వేయాలి. రెండు రోజుల్లో ఆ పని పూర్తి అవుతుందని చెప్పాడు.

రాజారామ్‌కి ఇల్లు నచ్చింది. అద్దె విషయంలో బేరం చెయ్యలేదు అడ్వాన్స్ యిచ్చాడు. వచ్చేవారం ఇంట్లోకి వస్తాను అని చెప్పాడు.

'సాయిబాబూ మా రాజాకి నువ్వే పాలు


*With Best Compliments From*

Ph: 23079802

**UNIVERSAL TRADING CORPORATION**

89, Panchaseela Colony,
Opp. Pragathi School,
IDA Gandhi Nagar,
Hyderabad - 500 037

Dealers in : Industrial Oils & Greases and
General Order Suppliers

పొయ్యాలి. అది కూడా నేను నీకు ఎలా యిస్తానో అలానే నీళ్ళు కలపకూడదు. కావాలంటే లీటర్‌కి ఓ రూపాయి ఎక్కువ తీసుకో' అన్నాడు ప్రసాద్.

'భలే వాడివి ప్రసాదూ' అన్నాడు సాయిబాబు.

***

రాజారామ్‌కి తలుచుకుంటే ఆశ్చర్యంగా వుంది.

సాయిబాబు గురించి ప్రసాద్ కాస్త వివరంగానే చెప్పాడు. ఇలాంటి మనుషులు కూడా వుంటారా అనిపించింది రాజారామ్‌కి. అయితే ఎదురుగా కని పిస్తున్నాడు కాబట్టి నమ్మకం తప్పటం లేదు.

సాయిబాబు కాఫీ, టీ లే కాదు, 'మందు' కూడా తాగడు. సినిమాలు చూడడు. సంగీతం వినడు. పేపర్ చదవడు. చుట్టుపక్కల వారి గురించి ఏ మాత్రం పట్టించుకోడు. అతనికి తెలిసింది పాలు పోయటం – పాలు పోయించుకోవటం. ఏ మాత్రం తీరిక దొరికినా నిద్రపోవటం.

ఈ మాత్రం ఇల్లు కట్టాడంటే అందుకు కారణం వాళ్ళ శ్రీమతి. ఆమె, అతని పిల్లలు కష్టపడతారు. పాల వ్యాపారంలో ఎగుడు దిగుడులు వచ్చిన ప్పుడు, వెన్న తీయడానికి మిషన్ కొన్నారు. ఆ తర్వాత 'పాలకోవా' తయారు చేసి స్వీట్ షాపులకి అమ్ముతున్నారు. పెరుగు–మజ్జిగా అమ్ముతారు. సాయిబాబు ఉదయం లేవటం–పాలు సేకరిం చటం. ఇంకేదయినా పనులుంటే చేయడం తర్వాత నిద్రపోవటం. అంతకు మించి ఏ విషయం పట్టించు కోడు. అతనికి కటిక నేలమీదా, ఏ సమయంలో పడితే ఆ సమయంలో నిద్ర వస్తుంది. వాళ్ళ ఆవిడ ఓ డబుల్ కాట్ చేయించి, దానిమీద 'యూ ఫోమ్' బెడ్ కొన్నప్పుడు ఇది అవసరమా అన్నాడు సాయి బాబు.

భగవంతుడు ప్రత్యక్షమై 'నీకు రంభ, ఊర్వశి కావాలా?' అని అడిగితే 'ఎవరూ అవసరం లేదు. నా నిద్ర చెడగొట్టకుండా వుంటే చాలు' అంటాడు

'ప్రసాదూ–సాయంకాలం పూట నువ్వు సెంట ర్‌కి వస్తావు. మనుషుల్ని కలుస్తావు. అసలు ఏ సంబంధాలూ లేకుండా వుండటం మనుషులకి ముఖ్యంగా సాయిబాబుకి ఎలా సాధ్యం అవు తుంది?' అన్నాడు రాజారామ్.

'అది సాయిబాబుని పుట్టించిన దేవుడికే తెలి యాలి' అన్నాడు ప్రసాద్

'దేవుడు అందర్నీ ఒకే రకంగా పుట్టిస్తాడు. సాయిబాబు యిలా వుండకూడదు' అన్నాడు

ప్రసాద్ నవ్వి 'నేను కనీసం కాఫీ, సిగరెట్టన్నా అలవాటు చేయాలనుకున్నాను.నా వల్ల కాలేదు' అన్నాడు.

'చూద్దాం. ఏలూరు వస్తున్నానంటే నాకు గొప్ప అనుభూతులు దొరుకుతాయనుకున్నాను. చలం గారు ఇక్కడే వున్నారు. చాగంటి సోమయాజులు గారు 'ఏలూరెళ్ళాలి' అనే గొప్ప కథ రాసారు. ఇక్కడ ఏరుని చూసి పొంగి పోవాలనుకున్నాను. అంటుంటే

'సాయిబాబు మాత్రం గొప్ప అనుభూతి కాదా?' అన్నాడు ప్రసాద్.

***

రాజారామ్ భార్యపేరు రుక్మిణి.

ఆమెకు సాయిబాబు గురించి చెప్పినప్పుడు మామూలుగా వింది. అంతకు మించి ఏ మాత్రం ఉత్సాహం చూపించ లేదు. ఏ ప్రశ్నలూ అడగలేదు. దీంతో రాజారామ్ కంగు తిన్నాడు.

ఎలా అయినా సాయిబాబుని మార్చి తీరాలి అనే నిర్ణయానికి వచ్చాడు. అప్పటి కప్పుడు ఆఫీస్‌కి ఫోన్ చేసి ఈ రోజు సెలవు తీసుకుంటున్నాను అని చెప్పి సాయిబాబు ఇంటికి బయలు దేరాడు.

పది గంటలవుతోంది.

సాయిబాబు ఇంట్లో వున్నాడు. కస్టమర్స్ ఎవరూ లేరు. అందుకే కుర్చీకి అనుకుని నిద్రపోతు న్నాడు.

'సాయిబాబుగారూ' అని పిలిచాడు. ఉలిక్కి పడి లేచాడు.

'ఏంటిసార్' అన్నాడు.

'మీతో మాట్లాడాలి'

'కూర్చోండి. నేను ప్రసాద్ చెప్పినట్లు మీకు చుక్క నీళ్ళు కూడా కలపకుండా పాలు పోస్తున్నాను. అప్పుడప్పుడు గేదెలకి వాతం చేస్తుంది. పాలు విరిగి పోతాయి. అయినా ఫర్వాలేదు. వాటితో స్వీట్స్ చేసుకోవచ్చు. ఎన్ని పాలు మీ ఇంటికి పంపించమం టారు' అన్నాడు గబగబా.

'పాలు అనే విషయం తప్ప మీరు యింకో విషయం మాట్లాడరా' అన్నాడు రాజారామ్.

'మోటర్ కాలిపోయిందా. బాగు చేయిద్దాం' అన్నాడు.

సాయిబాబు ముఖంలో ఫీలింగ్స్ కనిపించవు. చెక్కలాంటి ముఖం.

ఎప్పుడైనా ఇతని ముఖంలో ఆందోళనగాని, అత్యంత ఆనందాన్నిగాని చూడగలనా అనుకు న్నాడు

'అవేం కాదు. మనం ఏటి ఒడ్డుకి వెళ్ళి మాట్లా డుకుందాం'

'ఇప్పుడా. మా ఆవిడ పనిమీద బయటకు వెళ్ళింది రోజూ ఈ పాటికి నిద్ర పోతుంటాను యిక్కడే మాట్లాడుకుందు' అన్నాడు

'మీ శ్రీమతిగారు ఎప్పుడు వస్తారు?'

'ఇంకో గంట పడుతుంది'

'మనం ప్రశాంతంగా మాట్లాడుకోవాలి. మీరు నిద్రపోని, మీకు ఖాళీగా వుండే టైం చెప్పండి' అన్నాడు రాజారామ్.

'అదీ...' అని ఆగిపోయాడు

'ఈ రోజు కాకపోతే రేపు?'

'సాయంకాలం అయిదు గంటలకి నేను మీ దగ్గర కొస్తాను'

'మరచిపోయి నిద్రపోతారేమో నేనే వస్తాను' అని ఇంకో మాట కోసం చూడకుండా వెళ్ళిపో యాడు రాజారామ్.

సాయిబాబు మళ్ళీ కుర్చీ వెనక్కి వాలిపో యాడు

****

నెల రోజుల తర్వాతగాని సాయిబాబు, రాజా రామ్ కలవటానికి కుదరలేదు.

ఇద్దరూ ఏటి ఒడ్డుకి వచ్చారు.

'ఈ మధ్యన మా మావయ్య చచ్చిపోయిన సంగతి మీకు తెలుసు

పనులన్నీ నేనూ, పిల్లలే చేసుకోవాల్సి వచ్చింది. కంటినిండా నిద్రపోయి చాలా రోజులయినట్లుంది' అన్నాడు సాయిబాబు.

'నాకు తెలిసి మీరు పాలు, నిద్ర ఈ రెండు విష యాలు తప్ప యింకే విషయం గురించి ఆలోచించ రనుకుంటా?'

'నేను చేసే పనులు అవే కదండి'

'మీకు 'మత్తు వదలరా' అనే పాట గురించి తెలుసా?'

'నేను సినిమాలు చూడను. పాటలు వినను. చిన్నప్పుడు మూడు సినిమాలు చేశాను. డబ్బు వుండేది కాదు. ఇరవై సంవత్సరాలయింది నేను సినిమా చూసి. మీరు ఏ విషయం గురించి మాట్లా డాలన్నారు?' అన్నాడు సాయిబాబు.

'సాయిబాబుగారూ మీ గురించి మీ చుట్టు పక్కల వారు ఏమనుకుంటున్నారో ఎప్పుడైనా తెలు సుకున్నారా?'



'అవన్నీ నేను పట్టించుకోనండి'

'పట్టించుకోవాలి. మనం మనుషులుగా పుట్టాం. అందులో సగభాగం నిద్రకు సరిపోతుంది. మీరు యింకా ఎక్కువ కాలం నిద్రలో వుంటారు. మనం అవన్నీ లెక్కలు తీస్తే గట్టిగా బతికేది మహా అయితే పది సంవత్సరాలు. మనకీ పశు పక్ష్యాదులకి తేడా వుండాలి కదండి. అవయితే తినటం-నిద్రపోవటం-చనిపోవటం చేస్తాయి. ఈ లోగా మనకే ఉపయోగపడతాయనుకోండి' అని ముఖంలోకి చూసాడు

ఏ భావం వ్యక్తం చేయకుండా చిన్నగా తలూపాడు సాయిబాబు.

'మనం బతకాలంటే పని చేయాలి. సంపాదించాలి. దీంతోపాటు చాలా పనులు చేయాలి. మీరున్నారు - కష్టపడ్డారు. ఇంకా కష్టపడుతున్నారు. అవన్నీ నిద్రకోసమా. రేపు మనం చనిపోతాం. కనీసం పది మందయినా..'ఈ మనిషి పోయాడే' అని బాధపడాలి. వాళ్ళు మనం వారికి ఏదో విధంగా సహాయపడ్డాం అని గుర్తు చేసుకోవాలి. మిమ్మల్ని ప్రపంచాన్ని మార్చమని నేను అనటం లేదు. మీ ఇంట్లో వారికి మీరు ఏం చేస్తున్నారో ఆలోచిస్తున్నారా? మీ వీధి సమస్యలు మీవి కాదా? రేపు అందరం ఏదో సమయంలో సమస్యల్లో యిరుక్కుంటాం. నలుగురి అవసరం పడుతుంది. ఎవరయినా మనతో కలసి వస్తారా?'

చిత్రంగా చూసాడు.

'బతుకంటే ఏంటండి. మంచి సంగీతం వినాలి. అప్పుడప్పుడూ భార్యా, పిల్లల్తో ఏటి ఒడ్డుకి రావాలి. అలాగే మీ చుట్టు పక్కల వారితో కలవాలి. ప్రపంచం చాలా అందమైనది. మనకి ప్రకృతి కళ్ళను యిచ్చింది మూసుకోవడానికి కాదు. మీరు ఏలూరు వదిలి యింకో ఊరికి వెళ్ళి ఎన్ని సంవత్సరాలయింది. పాల కోసం వెళ్ళే ఊర్ల గురించి చెప్పొద్దు. అందరూ మీలా అనుకుంటే ఈ ప్రపంచం నడుస్తుందా. నేను మీ గురించి తెలుసుకున్నాను. ఏ అభిరుచి లేకుండా బతకటం చాలా విషాదం. ఇప్పటికైనా మీరు మారండి. ఏదొకటి చెయ్యండి. సాయిబాబంటే నీళ్ళ పాలు అమ్మే మనిషిగా మిగిలిపోవద్దు.'

ఏటి గట్టుమీదున్న చెట్లనుండి పిట్టల అరుపులు వినిపిస్తున్నాయి.

సెలయేరు గలగలమంటూ ప్రవహిస్తోంది.

రాజారామ్ మాట్లాడుతున్నాడు.

రెండు గంటలు గడిచిపోయాయి. తన మాటలు సాయిబాబు వింటున్నాడో లేదో పట్టించుకోవటం లేదు.

'మనకోసం మనం బతకాలి. నిరంతరం మెలకువగా వుండాలి.

మనిషి ఆఖరి నిద్ర మరణమే. అప్పుడు ఎంత మంది లేపినా మూసుకున్న కళ్ళు మనం తెరవలేం' అన్నాడు చివరిగా.

సాయిబాబు ముఖంలో ఎలాంటి భావం కనిపించలేదు.

***

రుక్మిణి పగలబడి నవ్వుతుంటే రాజారామ్ ఆశ్చర్యంగా చూస్తూ-

'ఎందుకంత నవ్వు తున్నావు' అన్నాడు

నవ్వటం ఆపింది.

'సాయిబాబులా నిద్రపోవటం మీకు చేతవుతుందా?' అంది.

నిర్ఘాంతపోయాడు.

'అనవసరంగా అతన్ని యిబ్బంది పెట్టారు. మీకు సంగీతం కావాలి. అందం కావాలి. ఇంకా చాలా మందికి లక్షలూ, కోట్లూ కావాలి. అందుకోసం ఇతరుల్ని కంటినిండా నిద్రపోనీయరు. వాళ్ళు నిద్రపోరు. నిద్రని కొంటున్నారు. పరుపులూ, ఆస్తులూ, అధికారం యివేవీ వారికి కమ్మటి నిద్రని యివ్వలేకపోతున్నాయి. అలాంటిది సాయిబాబు అనే వ్యక్తి తనకంటూ చిన్నగదిని కట్టుకుని నిద్రపోతుంటే చూడలేకపోయారు అతన్ని చెడగొట్టటానికి ప్రయత్నం చేశారు. మనుషులు నిద్రపోవాలి. కనీసం అప్పుడైనా చెడ్డ పనులు చేయకుండా వుంటారు' అంది రుక్మిణి.

'ఇదేంటి వితండవాదం చేస్తున్నావు?'

'ఇప్పుడు జరిగేవన్నీ వితండవాదనలే. మీరు హాయిగా నిద్రపోయి ఎన్ని రోజులయింది. మీరు చెప్పేవన్నీ మీకు నిద్రనెందుకు దూరం చేస్తున్నాయి?'

'నేను సమాజం గురించి ఆలోచిస్తున్నాను. నేను ఈ ఉద్యోగం మానేస్తున్నాను. రేపట్నుంచి ఓ కార్యకర్తలా పని చేస్తాను' అన్నాడు

'దీనికి ముందు ఓ పని చేయండి. అందరూ కమ్మగా నిద్రపోయే సమాజాన్ని కలగనండి. ఇంకెవరికీ హాని చేయని మనుషుల్నీ 'రాత్రి' ప్రకృతిలో భాగం అనీ, అందరూ రాత్రి పూట నిండుగా నిద్రపోవాలని కోరుకోండి.

'నిద్ర విలువేంటో పత్రికల వారికి, అమెరికా వారికోసం పనిచేసేవారికి తెలుస్తుంది' అంది. రాజారామ్ మాట్లాడలేదు.

రాత్రంతా రకరకాల ఆలోచనలు. పుస్తకాలు, సంగీతం, టీ.వీ. ఏవీ అతన్ని సంతృప్తి పరచకపోగా మరింత కల్లోలానికి గురి చేసాయి.

తెల్లవారు ఝామున ఎప్పుడో నిద్రపట్టింది.

***

మధ్యాహ్నం దాటిపోయింది.

రాజారామ్ నిద్రలో అటూ ఇటూ కదిలి మెల్లగా కళ్ళు తెరిచాడు.

దూరంగా ఏదో పుస్తకం చదువుకుంటూ కనిపించింది రుక్మిణి.

కళ్ళు మండుతున్నాయి.

'టైమెంతయింది' అన్నాడు.

'రెండు దాటింది' అంది రుక్మిణి పుస్తకం నుండి తల బయటపెట్టి.

'నిద్ర లేపాల్సింది'

'చాలా రోజుల తర్వాత మంచి నిద్రపోయారు. లేపాలనిపించలేదు' అంది.

రాజారామ్ దుప్పటి విసిరి మంచం మీద కూర్చున్నాడు.

'ఈరోజు పొద్దున్నే సాయిబాబు వచ్చారు. మీరు నిద్ర పోతున్నారంటే వెళ్ళిపోయారు. ఇప్పటికి మూడుసార్లు వచ్చారు.

'ఎందుకంట?'

ఏమో తెలియదు. ముఖంలో ఆందోళన కనిపించింది. ఈ రోజు పాలు పోయించటానికి వాళ్ళ అబ్బాయిని పంపించాడంట.

రాత్రి నిద్ర పోయినట్లు లేదు. కళ్ళు ఎర్రగా వున్నాయి. మీతో ఏదో మాట్లాడాలన్నారు'

'ఏంటో అడగకపోయావా?'

'మీలానే పాల ఉద్యోగం మానేసి కార్యకర్తగా పని చేస్తారేమో. ఏమైనా సాయిబాబుగారి మంచి రోజులన్నీ కరిగిపోయాయి' అని పుస్తకం చదవటం మొదలు పెట్టింది.

'ఏంటా పుస్తకం' అన్నాడు

'కవిత్వం. ఈ పద్యం బాగుంది. చదవనా' అంది.

రాజారామ్ మాట్లాడకుండా చూస్తున్నాడు.

'కవీ......

నీకేం నువ్వు నిద్రపోతున్నావు

మమ్మల్ని మేల్కొలిపి' అని రాజారామ్ కేసి నవ్వుతూ చూసింది.

★

ఫోన్ 92465 73575

